
**సమసమాజం ఉపన్యాసాలవల్ల వస్తుందా? ఉన్న స్థితిలోనే పక్కమనిషికి సాయం చేసే ఆచరణవల్ల వస్తుందా?**

# సమ సమాజం

"శివం"



ఎద్దవాడు బ్రతుకుభారాన్ని మోయలేక మోయలేక మూల్గుతూ మోస్తున్నట్లు, బస్సులన్నీ విపరీతమైన భారంతో వస్తున్నాయి- సికిందరాబాద్ బస్‌స్టాండ్‌లోకి. మళ్ళీ అంతకంటె రెట్టింపు భారాన్ని మోసుకుంటూ, కాస్సేపయినాక వెళ్ళిపోతున్నాయి.

ఒకటవ నంబరు బస్సు కోసం వెతుకుతున్నాయి నా కళ్ళు.

"అసలు సమాజానికి పట్టిన జాడ్యం వదలాలంటే, స్వార్థం మనందరిలోనూ నశించాలి భాయి" అన్నాడు వెంకట్రావు నా భుజం తడుతూ.

ఎంత కరెక్టుగాచెప్పాడు వెంకట్రావు. ఈనాడు రాజకీయ నాయకుల దగ్గరనుంచి అధికారుల వరకు అంతా స్వార్థంతో ప్రవర్తిస్తున్నారు. వీళ్ళే కనక కొంచెం స్వార్థం వదులుకుంటే—

ఒకటోనంబరు బస్ వచ్చిపడింది.

"నువ్వు చెప్పింది కరెక్టు బ్రదర్! ఆరు గంటలకి 'వై. యం. సి. ఏ'కి రాకూడదూ. నా వుపన్యాసంవుంది" అంటూ వెంకట్రావుని వదిలి జనప్రవాహంవైపు కదిలేను.

"సబ్జక్టు యేమిటోయ్" అన్నాడు అరుస్తూ.

"సమసమాజ నిర్మాణం" అంటూ జనంలో కలిసిపోయేను.

బస్ ఆగింది. జనం దిగుతూనేవున్నారు. లోపలికి ప్రవేశించడానికి కుమ్ములాట ప్రారంభమయింది. మన దేశంలో 'క్యూ' అలవాట్లు - రాజధాని నగరంలో కూడాలేవు. ఉపన్యాసంకోసంకుట్టించినఖాదీ లాల్చీ చిరగకుండా లాల్చీలోని పర్సు ఎగిరిపోకుండా జాగర్త పడుతూనే వున్న బలాన్నంతా వుపయోగించి ఎట్లాగైతేనేం లోపలికి ప్రవేశించేను. అప్పటికే మూడొంతులుబస్సు నిండిపోయింది. అదృష్టం బావుండి ఖాళీగా వున్న ఓ సీటు పైన దృష్టి ఆనింది. ఒక్క అంగలో వురికి ఆ సీటు దక్కించుకున్నాను- అడ్డం వచ్చిన యిద్దరు- ముగ్గుర్ని లాఘవంగా తప్పించుకుని.

ఆ బస్సులో ఒకవైపున అంతా ముగ్గురు ప్రయాణీకులు కూర్చునే సీట్లు. మరో వరుసలో ఒక్కళ్ళే కూర్చునేసీట్లు. ఆఖరులో ఎనమండుగురు కూర్చునే సీటు వకటి వుంది. నాకు ముగ్గురు కూర్చునే సీటులో కిటికీవైపునే ఖాళీ దొరికింది. 'అమ్మయ్య' అని చిన్న నిట్టూర్పువిడిచి కిటికీలోనుంచి ఓసారి బయటకు చూసిన తర్వాత, దృష్టిని బస్సు నలువైపులకి సారించేను. బస్సు బాగా క్రిక్కిరిసిపోయింది అప్పుడే. జనం నిలబడటానికి కూడా చోటులేక తొక్కులాడుకుంటున్నారు. ఏదో మూలనుంచి కండక్టర్ టిక్కెట్లు యివ్వడం ప్రారంభించిన అలికిడి వినవస్తోంది.

నేను సిగరెట్ ఒకటి వెల్గించుకుని. తృప్తిగా కిటికీలోనుంచి బయటకు పొగ వదుల్తూ, ఇంకో గంటలో 'వై. యం. సి. ఏ.'లో యివ్వవలసిన ఉపన్యాసం గురించి పాయింట్లు నెమరువేసుకోసాగేను.

కండక్టర్ వచ్చి టికెట్ యిచ్చి వెళ్ళిపోయేడు. జనం యింకా ఎక్కుతూనే వున్నారు. నిలబడినవాళ్ళు తోసుకుంటూనే వున్నారు.

కండక్టర్ బెల్ కొట్టేడు. డ్రైవర్ బస్‌ను స్టార్టు చేసేడు. ఇంతలో ఒక యాభై ఏళ్ళ కుంటివ్యక్తిని ఫుట్‌బోర్డు పైన నిలబడ్డ జనం లోపలికి తోసేరు. కుంటివ్యక్తి ఒక్క క్షణం పైనుంచి వ్రేలాడే పట్టీ అందక వూగులాడి, ఎట్లాగైతేనేం పట్టీని పట్టుకోగల్గేడు. జనం అంతా జాలిగా అతనివైపే చూడసాగేరు.

బస్సు ఎక్స్‌ప్రెస్సు బస్సు. అన్ని చోట్లా ఆగదు- వేగంగా పోతోంది. కిటికీ దగ్గరగా వుండటంవల్ల నాకు మాత్రం చల్లగా, హాయిగా గాలి తగులుతోంది. లోపలివాళ్ళు గాలిఆడక మగ్గిపోతున్నారు.

# మల్లెపందిరి

## పెద్దనల కవిత

స్త్రీల జుట్టులా తేనెటీగల నలుపు గలిగి, కుచములవలె ముక్తాసరములతో



సరసమై అక్షరముల అంతులేని మధురిమగల అధరంలా మహాత్ముల కవిత జయిస్తుంది. వినేవారిని ఆకట్టు కుంటుంది.

భ్రమరహితా సా కచవత్,
స్త్రీణాం కుచవచ్చ సరస హితా
సదక్షర పీయూషా(అ) ధరవత్
కవితా మహాత్మనాం జీయాత్॥

మహాత్ముల కవిత భ్రమరహితమై (దుర్భ్రమకు చోటివ్వనిదై), సరసమై, అక్షరమయమైన అమృతం చిందిస్తూ రంజింప జేస్తుంది.

—సౌ భ రి

నా ప్రక్కన స్టూడెంట్‌లా వున్న కుర్రాడు కూర్చునివున్నాడు. ఆ ప్రక్కన అరవయి ఏళ్ళ వృద్ధుడు కూర్చునివున్నాడు. జనం అంతా ఆర్. టి. సి. వాళ్ళను, బస్సుని యిట్లా 'ఓవర్‌లోడ్' చేసి నడుపుతూన్నందుకు, తగినన్ని బస్సులు వెయ్యనందుకు తిట్టుకుంటున్నారు.

నా ప్రక్కనున్న స్టూడెంట్ కుర్రాడు- "ఇదే కలకత్తా అయితేనా- యిట్లాంటి బస్సుల్ని తగలేసేవాళ్ళు!" అన్నాడు.

ముసలాయన నిలబడి అవస్థపడ్తూన్న కుంటివానివైపు చూస్తున్నాడు- స్టూడెంట్ కామెంట్ వినకుండా.

నేను నిద్ర వడుతూన్నట్లు కళ్ళు మూసుకున్నాను. గోల్కొండ చౌరస్తా వచ్చి బస్ ఆగింది. ముసలాయన కాబోలు "నువ్వు కూర్చో బాబూ! పాపం అవస్థ పడ్తున్నావు." అంటున్నాడు. కళ్ళు తెరిచి చూసేను. ముసలాయన లేచి నిలబడి వున్నాడు. ఆయన స్థానంలోకి కుంటి అతను వచ్చి కూర్చున్నాడు. "నేను యిక్కడే దిగిపోతాలే" అంటూ ముసలాయన దిగకండా తోలుపటకా పట్టుకుని నిలబడే వున్నాడు. కుంటివ్యక్తి సందేహిస్తూ నిలబడి "తమరు కూర్చోండి. నేను నిలబడగలను" అన్నాడు ముసలాయనతో. ముసలాయన చిర్నవ్వునవ్వి, "వద్దు— కూర్చో. నేను వచ్చే స్టాపులో దిగిపోతా" అంటూ కుంటివ్యక్తి భుజంపైన చెయ్యి వేసి, అతను కూర్చున్నాక ఏమీ జరగనట్టు ఎటో చూడసాగేడు.

ఈ వ్యవహారం నాకు [illegible]చెం బాధాకరంగానే వుంది. ఇంతమంది [illegible]వకులం. ధృడకాయులం, ఈ బస్సులోవుండి కుంటివానికి సీట్ యివ్వలేకపోవడం కొంచెం నామర్దాగానే అన్పించింది నా మట్టుకు నాకు. క్షణంలో మనస్సు నోరు మూయించి, ఏమీజరగనట్లు కళ్ళు మూసుకుని వుపన్యాసం గురించి ఆలోచించుకోసాగేను.

రోడ్లు రాజధాని రోడ్లలాగ లేవు. బస్ ఎక్స్‌ప్రెస్ బస్‌లాగ పోవడంలేదు. ఎగిరెగిరిపడుతోంది. జనం నడుములు విరుగుతున్నాయి. డ్రైవర్ ఆకస్మికంగా బ్రేక్ వేస్తున్నాడు. అంత కంటె మరింత ఆనకస్మికంగా స్టార్టు చేస్తున్నాడు. ఒకో చోట అయిదేసి నిమిషాలు స్తబ్దులా ఆగిపోతూవుంది బస్. సినిమాల జనం. ఇసక వేస్తే రాలనంత జనం. బళ్ళు. లారీలు. వచ్చేపోయే బస్సులు. సామాన్య మానవుడు బస్ నడపలేడీ సమయంలో ఈ రోడ్ పైన! చార్ మినార్ చౌరస్తా వచ్చిపడింది.

సగంబస్ ఖాళీ అయింది. ఒకటిన్నర బస్ జనం ఎక్కేరు. కిటికీవద్ద కూర్చున్న నాకుకూడా గాలి ఆడటంలేదు. కిటికీ బయటకు తలపెడితే. తల మళ్ళీ దొరకదు. అయినా క్షణం బయటకుపెట్టి గాలి పీల్చుకుని తలను లోపలకు లాక్కున్నాను.

బస్ కదిలింది. 'అమ్మయ్య' అని అంతా నిట్టూర్చేరు. మళ్ళీ అంతలోనే ఆగిపోయింది ట్రాఫిక్ సిగ్నల్ కోసం. నేను కళ్ళు మూసుకున్నాను- ముసిరే ఆలోచనలను సర్దుకుందామని. సర్దుకోకండానే బస్ మళ్ళీ కదిలింది. బస్‌లోకి చల్లటిగాలి వస్తోంది- బస్ వేగానికి.

పడుతూ, లేస్తూ, వణుకుతూ, చేతికర్ర ఆధారంతో ఒక పక్షవాతపు రోగి—40 ఏళ్ళుంటాయి. బస్ మధ్యకువచ్చి బస్ వేగానికి తూలి కుంటివాడి సీటుకొచ్చి ఆనుకుని నిలబడిపోయేడు. నేను సూడెంటు కుర్రాడివైపు చూసేను.

స్టూడెంట్ కుర్రాడు "ఇంత "రష్ టైం"లో వీళ్ళంతా యెందుకు చెప్పండి ప్రయాణాలు! ఇదే కలకత్తాలో అయితేనా" అంటున్నాడు. ఈ రోజుల్లో ఈ విద్యార్థులకి ఏమీ చెప్పలేం అనుకుని. విసుక్కుంటూ. కిటికీలోంచి బయటకు చూడసాగేను.

"ఆప్ బైఠీయే సాబ్! మై యహా వుతర్ జావుంగా" అంటూ కుంటిఅతను నిలబడి, ఎగురుకుంటూ వెళ్ళి పటకాపట్టుకుని నిలబడ్డాడు. పక్షవాతపు రోగి— ఒక్కక్షణం తెల్లబోయి, తేరుకుని 'థాంక్స్' అని చెబుతూ కుంటివాని స్థానంలో సర్దుకుని కూర్చుని, చేతి రుమాలుతో మొహం తుడుచుకో సాగేడు— వణికే చేతుల్తో!

వై. యం. సి. ఎ. స్టాప్ వచ్చింది. బస్ ఆగింది. ఎవరివైపూ చూడకండా. జనాన్ని తోసుకుంటూ గబగబ దిగిపోయేను — 'సమ సమాజం' మీద వుపన్యాసం యివ్వడానికి!

